సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం : 7 : జూన్ : 2025



పశువులకు వ్యాధుల ముప్పు
వర్షాలతో పశువులు, గొర్రెలు ఇతర జీవాలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 10లో ▸



వరాల వెంకన్న కల్యాణం
ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. గ్రామంలో తీర్థ మహోత్సవం జరిగింది. 10లో ▸




త్యాగానికి ప్రతీక బక్రీద్
ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా బక్రీద్ పండుగను జరుపుకుంటారు. 10లో ▸

మధ్యతరగతి.. అధోగతి

మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. ఆర్థిక అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం చేకూరకపోవడంతో అప్పులబాట పడుతున్నారు. ఇదే అదనుగా పల్లెల్లో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం కోరలు చాచింది. రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీ వ్యాపారం ఇష్టారాజ్యంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడిచినా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకపోగా.. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో మధ్యతరగతి వర్గాలు సతమతమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా సంక్షేమ పథకాల రూపంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమకాగా.. ప్రజలు అప్పుల వైపు వెళ్లని పరిస్థితి.

అప్పులతో సతమతం
- ఏడాదిగా నిలిచిన సంక్షేమ పథకాలు
- పల్లెల్లో కోరలు చాచిన మైక్రో ఫైనాన్స్ వ్యాపారం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఆర్థిక భరోసా
- జిల్లాలో ఏటా సగటున రూ.1,850 కోట్లు అందజేత
- నాడు కళకళలాడిన వ్యాపారాలు
- నేడు కూటమి పాలనలో వెలవెల



సాక్షి ప్రతినిధి, ఏలూరు : కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత సామాన్యుడి కష్టాల తారాస్థాయికి చేరాయి. ఒకవైపు మండుతున్న నిత్యావసరాల ధరలు, మరోవైపు ప్రభుత్వ చేయూత లేకపోవడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ అంటూ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నాయకులు చేతులెత్తేశారు. తల్లికి వందనం అందించకుండా ఒక విద్యా సంవత్సరం, అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వకుండా ఖరీఫ్, రబీ సీజన్లు గడిపేశారు.

తగ్గిన కొనుగోలు శక్తి

మార్కెట్‌లో నగదు లావాదేవీలతో పాటు ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడంతో వ్యాపారాలు మందగించాయి. గత ప్రభుత్వ హయాంలో సంక్రాంతికి అమ్మఒడి పథకం కింద ఏలూరు జిల్లాలో 1,78,214 మంది తల్లుల ఖాతాల్లో రూ.267.32 కోట్లు నగదు జమైతే కేవలం పండుగ రోజుల్లోనే జిల్లాలోనే రూ.150 కోట్ల నుంచి రూ.170 కోట్ల టర్నోవర్ జరిగినట్టు అంచనా. అయితే ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో 50 శాతం కూడా కొనుగోళ్లు లేవని వ్యాపార వర్గాలు అంటున్నాయి. గతంలో డీబీటీ పథకాలు కావడంతో మార్కెట్‌లో నగదు రొటేషన్‌లో ఉండటం, ప్రజల్లో కొనుగోలు శక్తి ఉండటంతో విక్రయాలు బాగా జరిగి వ్యాపారాలు కళకళలాడటంతో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికీ ఆదాయం సమకూరేది. ఈ ఏడాది మాత్రం జీఎస్టీ మొదలు అన్ని లావాదేవీలు తగ్గిపోయాయి. కొన్ని రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండగా ఇప్పటికీ తల్లికి వందనంపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

గత ప్రభుత్వంలో ఏటా రూ.1,850 కోట్లకు పైగా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.1,850 కోట్లకు పైగా నగదు జిల్లాలో లక్షలాది మంది బ్యాంకు ఖాతాల్లో జమకాగా.. నేడు ఒక్క రూపాయి కూడా జమ కాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పథకాలకు పేర్లు, లబ్ధి నగదు మొత్తాన్ని మార్చి ప్రకటించినా అమలు చేయకపోవడం గమనార్హం. ఈ లెక్కన ఏలూరు జిల్లాలో రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాల నగదు ప్రజల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల అమలు

వైఎస్సార్ రైతు భరోసా
2019–20లో 2,31,061 మంది రైతులకు రూ.311.93 కోట్లు, 2020–21లో రూ.297.73 కోట్లు, 2021–22లో రూ.265.67 కోట్లు, 2022–23లో రూ.262.11 కోట్లు మొత్తంగా రూ.1,137.34 కోట్లు అందజేత

జగనన్న విద్యాదీవెన
2019–20లో 36,527 మంది విద్యార్థులకు రూ.95.78 కోట్లు, 2020–21లో రూ.77.97 కోట్లు, 2021–22లో రూ.105.67 కోట్లు, 2022–23లో 56.16 మొత్తంగా రూ.335.58 కోట్ల లబ్ధి చేకూర్చారు.

జగనన్న అమ్మఒడి
2019–20లో 1,80,327 మంది మహిళల ఖాతాల్లో రూ. 270.49 కోట్లు, 2020–21లో 266.16 కోట్లు, 2021–22లో 276.36 కోట్లు మొత్తంగా రూ.813.01 కోట్లు అందించారు.

వైఎస్సార్ ఆసరా
ఏలూరు జిల్లాలో మూడు విడతల్లో రూ.985.82 కోట్లు జమ చేశారు. 3,55,315 మంది మహిళల ఖాతాల్లో 2020–21లో రూ.327.56 కోట్లు, 2021–22లో రూ.329.92 కోట్లు, 2022–23లో రూ.328.34 కోట్లు అందజేశారు.

వైఎస్సార్ చేయూత
2020–21లో 94,670 మంది మహిళలకు రూ.177.51 కోట్లు, 2021–22లో రూ.165.60 కోట్లు, 2022–23లో రూ.218.42 కోట్లు మొత్తంగా రూ.561.53 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

అప్పులతో ఇబ్బందులు



గతంలో మా కుటుంబానికి మూడు పథకాల కింద ఏడాదికి రూ.50 వేల వరకూ వచ్చేవి. వాటితో అప్పులు తీర్చడంతో పాటు కొంత పొదుపు చేసుకునే వాళ్లం. ఇంట్లో అవసరమైన సామగ్రిని నెలవారీ వాయిదా పద్ధతిలో తీసుకుని పథకం డబ్బులతో చెల్లించేవాళ్లం. ఇప్పుడు పొదుపు మాట అటుంచి చేసిన అప్పులు తీర్చడానికే ఇబ్బందులు పడుతున్నాం. – గొంతిన ఝాన్సీలక్ష్మి, గృహిణి

అవస్థలు పడుతున్నాం



కుటుంబ అవసరాల కోసం గతంలో లేదనకుండా అప్పు ఇచ్చేవారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధితో అప్పులు తీర్చేవాళ్లం. ఇప్పుడు పథకాలు అమలు చేయకపోవడంతో మాకు ఆదాయం వచ్చే దారి లేదని గ్రహించి అప్పులు ఇచ్చేవాళ్లు నిరాకరిస్తున్నారు. అవసరానికి అప్పు పుట్టక అవస్థలు పడుతున్నాం. – పోలిశెట్టి ఈశ్వరి, ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయురాలు

నమ్మి మోసపోయాం



ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నమ్మి మోసపోయాం. మాలాంటి మహిళలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న పథకాలు ఒక్కటి కూడా అమలు చేయకపోవడం బాధాకరం. రాష్ట్రంలోని మహిళల ఆవేదనను గ్రహించి ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అమలు చేస్తారని ఆశిస్తున్నాం. – కె.కనకదుర్గ, చిగురుకోట, ముదినేపల్లి మండలం

పథకాలన్నీ ఇవ్వాలి



గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలన్నీ మరలా ఇప్పుడు కూడా ఇచ్చేలా చూడాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అందించిన పథకాలు పేదలకు ఎంతో వెసులుబాటు కలిగించేవి. అవి నిలిపివేయడంతో చాలా మంది పేదలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తిరిగి పథకాలన్నీ ప్రవేశపెట్టాలి. – నల్గొండ నాంచారమ్మ, మండవల్లి

బీసీల రుణాలకు మోక్షమెప్పుడో?

- ఇంటర్వ్యూలు ముగిసి రెండు నెలలు
- రుణాల మంజూరుపై స్పష్టత కరువు
- ఆందోళనలో బీసీ వర్గాలు



మండలాల వారీగా దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు
ఏలూరు	500	బుట్టాయగూడెం	109
దెందులూరు	690	ముదినేపల్లి	717
పెదవేగి	816	నిడమర్రు	605
పెదపాడు	658	మండవల్లి	664
ద్వారకాతిరుమల	529	లింగపాలెం	479
కామవరపుకోట	620	కుక్కునూరు	130
జంగారెడ్డిగూడెం	546	ఆగిరిపల్లి	564
టి.నర్సాపురం	604	జీలుగుమిల్లి	804
చింతలపూడి	634	కైకలూరు	1,599
భీమడోలు	890	కలిదిండి	829
ఉంగుటూరు	602	కుక్కునూరు	130
నూజివీడు	500	వేలేరుపాడు	43

ఏలూరు జిల్లాలో బీసీ ఉప కులాలు 56
బీసీల జనాభా సుమారు 6.54 లక్షలు

దెందులూరు: జిల్లాలో బీసీలు ఉపాధి రుణాల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రుణాలతో చిన్నపాటి వ్యాపారాలు, ఉపాధి మార్గాలతో జీవనం సాగించవచ్చన్న వీరి ఆశలు నెరవేరడం లేదు. బీసీ రుణాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అధికారుల ఇంటర్వ్యూల ప్రక్రియ కూడా ముగించి దాదాపు రెండు నెలలు కావస్తుంది. అయినా ఇప్పటికీ రుణాల మంజూరు ప్రక్రియపై స్పష్టత లేదు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వెనుకబడిన తరగతుల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తుంటారు. అయితే కూటమి నాయకులు ఈ రుణాలను తమ అనుయాయులకు ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇంటర్వ్యూల ప్రక్రియ నామమాత్రంగా జరగడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు.

లబ్ధిదారుల్లో గందరగోళం

అర్హులకు బీసీ రుణాలు అందుబాటులో లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. యూనిట్లు తక్కువగా ఉండటం, దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం నెలకొంది.

స్పష్టత కరువు




ప్రభుత్వం బీసీ రుణాలు మంజూరు చేస్తామంటూ ప్రకటన ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోమని చెప్పి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అయితే ఇప్పటివరకూ రుణాలు మంజూరు చేయకపోవడం వెనుక కారణాలు ఏమిటో. రుణాల మంజూరుపై స్పష్టత లేదు.
– ఎం.సూర్యనారాయణ, హస్తకళల కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్

బీసీలను ఆదుకోవాలి




బీసీ రుణాలు వెంటనే అర్హులకు మంజూరు చేయాలి. తాత్సారం వీడాలి. వేల మంది స్వయం ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. రుణాలు మంజూరు చేసి ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మంది బీసీలను ఆదుకోవాలి. వివాదాలకు తావివ్వకుండా మంజూరు చేయాలి.
– మోరు రామరాజు, బీసీ సంఘం కొల్లేరు రాష్ట్ర నాయకులు

నిజాయతీగా వ్యవహరించాలి



కూటమి ప్రభుత్వం రుణాల మంజూరు విషయంలో నిజాయతీగా వ్యవహరించాలి. రుణాల కోసం బీసీ వర్గాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆశలు అడియాసలు చేయకండి. సూపర్ సిక్స్ హామీలు మాదిరి పక్కన పెట్టకండి.
– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్

రాజకీయ జోక్యం తగదు



బీసీ రుణాల మంజూరులో రాజకీయ జోక్యం ఉండకూడదు. పూర్తిగా అధికారులు, బ్యాంకర్లు పారదర్శకతతో అర్హులకు రుణాలు మంజూరు చేయాలి. రాజకీయ జోక్యం ఉంటే ఒక్క అర్హుడికి కూడా రుణం మంజూరు కాదు. జిల్లా అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలి.
– అంగడాల సీతారావమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం దెందులూరు నియోజకవర్గ అధ్యక్షురాలు

కాలువ పనుల పరిశీలన



కాలువ గట్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

ఉండి: గత నెలలో ప్రారంభమై లోపభూయిష్టంగా జరుగుతున్న ఉండి కాలువ పూడికతీత పనులపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కలిసిపూడి రెగ్యులేటర్ నుంచి కాలువ శివారు వరకు పనులు ఇష్టానుసారం జరగ్గా రైతులు ఆందోళన చెందారు. పూడికతీత పనుల్లో భాగంగా కుంగిన కాలువ గట్లను మరోసారి మరమ్మతులు చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. శుక్రవారం చెరుకువాడ, కలిసిపూడి ప్రాంతాల్లో కుంగిన కాలువ గట్లను ఇరిగేషన్ ఏఈ ఫణి శంకర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కుంగిన గట్లను త్వరలోనే బాగుచేసి సాగునీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేస్తామని ఏఈ తెలిపారు.

ప్రశాంతంగా పీజీ ఈసెట్

భీమవరం: ఎంటెక్, ఎం ఫార్మసీలో ప్రవేశాలకు పీజీ ఈసెట్ పరీక్షలు భీమవరంలోని డీఎన్నార్ అటానమస్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఉదయం 152 మందికి 139 మంది, మధ్యాహ్నం 146కి 128 మంది అభ్యర్థులు హాజరైనట్లు పర్యవేక్షకులు తెలిపారు. విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉదయం 80కి 80 మంది, మధ్యాహ్నం 80కి 63 మంది హాజరయ్యారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం



భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 30 వరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనుండగా.. తొలిరోజు భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రమే పరీక్షలు జరిగాయి. ఉదయం 110 మంది అభ్యర్థులకు 100 మంది, మధ్యాహ్నం 110 మందికి 97 మంది హాజరయ్యారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో సుమారు 16,600 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. 23 రోజుల పాటు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. డీఈఓ ఈ.నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్ తంగిరాల హరి ఆనంద్‌ప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.అంజన్ కుమార్ ఉన్నారు.

పుస్తకాల వ్యాపారంపై ఫిర్యాదు



తనిఖీ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఆకివీడు: స్థానిక చైతన్య విద్యాసంస్థలో పుస్తకాలు విక్రయిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు మేరకు శుక్రవారం విద్యాశాఖ సిబ్బంది తనిఖీలు చేశారు. అనంతరం పాఠశాలలో పుస్తకాలు ఉండే గదికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే పుస్తకాల వ్యాపారం లక్షల్లో జరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థ అయిన చైతన్య స్కూల్‌లో పుస్తకాల విక్రయాన్ని తమ నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. అధికంగా ఫీజుల వసూలుతో పాటు విద్యా సామగ్రి అమ్మకాల ద్వారా కార్పొరేట్ సంస్థలు కోట్లు గడిస్తున్నాయన్నారు. పుస్తకాల విక్రయంపై మండల విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. సిబ్బందిని పంపి చేతులు దులుపుకుంటున్నారని, నోటీసులు ఇచ్చామని చెబుతున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లిప్తంగా ఉంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.నాగేంద్ర, కె.గోవింద్, కె.రోహిత్, పట్టణ నాయకులు సాయి, వంశీ, సాయి కృష్ణ పాల్గొన్నారు.

9న కొల్లేరుపై కీలక సమావేశం

కైకలూరు: సుప్రీంకోర్టు ఆదేశాలతో కొల్లేరు పరిశీలనకు త్వరలో రానున్న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ)కి నివేదించే అంశాలపై ఈనెల 9న ఉదయం 9 గంటలకు కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న సమావేశానికి కొల్లేరు పెద్దలు తరలిరావాలని రాష్ట్ర చేపల రైతుల సంఘ అధ్యక్షుడు తాడినాడ బాబు శుక్రవారం కోరారు. కొల్లేరు ప్రజల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. కమిటీ దృష్టికి కొల్లేరు గ్రామాలకు సంబంధించిన సమస్యలు, ఇతర అంశాలను రాతపూర్వకంగా గ్రామాల ప్రజలు తీసుకురావాలని చెప్పారు. గ్రామాల జనాభా, విస్తీర్ణం, కొల్లేరుకు సంబంధించిన అంశాలు అందులో ఉండాలన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హాజరవుతారన్నారు.

9న ఆయిల్‌పామ్ రైతుల ధర్నా

పెదవేగి: కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై 10 శాతం దిగుమతి సుంకం తగ్గించడాన్ని నిరసిస్తూ ఈనెల 9న ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆయిల్‌పామ్ రైతుల ధర్నా, రైతుల సామూహిక రాయబార కార్యక్రమం చేపట్టినట్టు ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజయరాయిలో ఆయిల్‌పామ్ రైతుల సమావేశాన్ని మున్నంగి సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దిగుమతి సుంకం తగ్గడంతో ఆయిల్‌పామ్ గెలల ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. పెదవేగిలో ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలన్నారు. రైతులు పూసం రామరెడ్డి, రాపర్ల తేజ కృష్ణ, నీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్ జగన్ వెంటే..
మీడియాలో దుష్ప్రచారంపై మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆగ్రహం



దెందులూరు: తాను ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే, వైఎస్సార్‌సీపీకే పనిచేస్తానని దెందులూరు **మాజీ ఎమ్మెల్యే** కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. కొన్ని మీడియా సంస్థలు తాను పార్టీ మారుతున్నట్టు చేసిన దుష్ప్రచారాన్ని శుక్రవారం ప్రకటనలో ఖండించారు. ప్రాణం ఉన్నంత వరకూ తనకు, తన కుటుంబానికి ఎంతో ఇష్టమైన వైఎస్ జగన్‌తోనే తన పయనం అన్నారు. తనకు వైఎస్సార్ కుటుంబానికి ఉన్న అనుబంధం విడదీయరానిదన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారాన్ని చేయటం బాధ కలిగించిందన్నారు. ఇది సిగ్గుచేటని అబ్బయ్య చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీనియర్ సిటిజన్ల పోస్టుకార్డు ఉద్యమం



తపాలా శాఖ అధికారికి పోస్టుకార్డు అందిస్తున్న సీనియర్ సిటిజన్లు

నరసాపురం: సీనియర్ సిటిజన్లకు గతంలో మాదిరిగా రైలు చార్జీల్లో రాయితీ ఇవ్వాలని కోరుతూ అఖిల భారత సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ పిలుపులో భాగంగా శుక్రవారం సంఘం నరసాపురం శాఖ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. రైలు చార్జీల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ ఇవ్వాలని ప్రధానికి పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంలో తపాలా శాఖ అధికారికి మొదటి పోస్టుకార్డు అందించారు. సంఘం నరసాపురం శాఖ అధ్యక్షుడు అందే రంగారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను తగు విధంగా గౌరవించి, వారి సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైలు చార్జీల్లో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు షేక్ సిలార్ సాహెబ్, పెన్మెత్స బాబూజీ, నెక్కంటి సుబ్బారావు, దాసిరి దేవరాజు, పితాని సత్యనారాయణ, కోట్ల చిరంజీవి పాల్గొన్నారు.

12న జాబ్‌మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న అప్రెంటీస్, జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారితో పాటు ఫైనలియర్ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ లేదా అప్రెంటీస్ అడ్వయిజర్‌ను సంప్రదించాలని కోరారు.

పని గంటల పెంపు నిర్ణయం తగదు

భీమవరం: రాష్ట్రంలో పని గంటలు పెంచేందుకు మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్రమైన ద్రోహం చేసి కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు 44 చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్లకు తెచ్చిందని పేర్కొన్నారు. 50 లక్షల మంది కార్మికులు పని చేస్తున్న షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో 13 ఏళ్లుగా కనీస వేతనాల సవరణ జరగకపోగా, కనీస వేతనాల బోర్డును నియమించలేదని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించలేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదని వీటిపై సీఎం చంద్రబాబు నోరు మెదపడటం లేదన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త లేబర్‌కోడ్స్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే రాత్రి సమయంలో కూడా మహిళలతో పనిచేయించేలా రూల్స్ రూపొందించడం అన్యాయమన్నారు. వీటిని అందరూ వ్యతిరేకించాలని కోరారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం గడువును ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 30 వరకూ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. ఈ సౌకర్యం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కు సమాంతరంగా కొనసాగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



చెస్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షుడు వబిలి శెట్టి వెంకటేశ్వరరావు బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు చదరంగంలో పోటీ పడడమేగాక పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచి పోషించడంలో ముందుండాలన్నారు. చదరంగం నేర్చుకోవడం ద్వారా మేధాశక్తిని పెంపొందించుకుని విద్యలో రాణించవచ్చన్నారు. ప్రథమ బహుమతి డి.సురేష్ (పాలకొల్లు), ద్వితీయ బహుమతి ఎన్.వరుణ్ తేజ్ (భీమవరం), తృతీయ బహుమతి ఎ.రామకృష్ణ (విజయవాడ) అందుకున్నారు. చెస్ పోటీల నిర్వాహకుడు మాదాసు కిషోర్, సురేష్ జైన్, నోముల రామారావు, సునీల్, గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాకీ పోటీలు ప్రారంభం



భీమవరంలో హాకీ పోటీల దృశ్యం

భీమవరం: రాష్ట్ర స్థాయి 15వ అంతర్ జిల్లాల బాలికల హాకీ పోటీలు శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించి డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్, పీడీ బీవీ నర్సింహరాజు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ప్రశాంతతకే గాకుండా ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి ఆనంద రాజు, కేవీఎస్ భరత్ మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే హాకీ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. అనంతరం పశ్చిమగోదావరి-కృష్ణా జిల్లా జట్ల మధ్య జరిగిన పోటీల్లో పశ్చిమగోదావరి జట్టు కృష్ణా జట్టుపై విజయం సాధించింది.

విద్యుత్ వైర్లు తగిలి లారీకి మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కడకట్ల శివారు ఖాళీ స్థలాల వద్ద శుక్రవారం లారీకి విద్యుత్ వైర్లు తగిలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్ సిబ్బంది వివరాల ప్రకారం.. లారీకి విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ లారీ నుంచి దూకి తప్పించుకున్నాడు. సిమెంట్ పని మీద వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. డీజిల్ ట్యాంక్ ఉన్న వైపు మంటలు చెలరేగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఫైర్ ఆఫీసర్ జీవీ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు ఖుర్బానీ ఇవ్వనున్న ముస్లింలు
- ఈ నెలలో పవిత్ర మక్కా సందర్శన





బక్రీద్ సందర్భంగా ముస్తాబు చేసిన చింతలపూడి మసీదు

చింతలపూడి: ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండ ప్రతి ముస్లిం బక్రీద్ పండుగను జరుపుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతిరూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లా ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ పండుగ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ జుహా (బక్రీద్). శనివారం దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్‌ను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు. గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాలలో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేస్తారు. పవిత్ర స్థలం మక్కాను సందర్శించడానికి ఇష్టపడతారు. సౌదీ అరేబియాలోని మక్కా వెళ్ళి కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. బక్రీద్ సందడి జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మొదలైంది. పండుగ సందర్భంగా పొట్టేళ్ల, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరికొద్ది మంది తాడేపల్లిగూడెం, గుంటూరు, మచిలీపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఖుర్బానీ కోసం సిద్ధం చేసుకున్నారు. స్థానికంగా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుండి రూ.20 వేల వరకు ధర ఉంటుందని వ్యాపారులు తెలిపారు. జిల్లాలోని ఏలూరు, నూజివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, ఆకివీడు, పోలవరం తదితర ప్రాంతాల్లో బక్రీద్‌ను ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 5 కోట్లకు పైగా పొట్టేళ్ళ వ్యాపారం జరుగుతుందని అంచనా.

పొట్టేళ్ళకు గిరాకీ

బక్రీద్ వస్తుందంటే పొట్టేళ్ళకు గిరాకీ పెరుగుతుంది. వారం రోజుల నుంచి మెట్ట ప్రాంతంలో పండుగ సందర్భంగా కొత్తబట్టలు, పండుగ సామాగ్రి కొనుగోలు చేశారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేశారు. పండుగ అయిపోయిన తరువాత నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చుకునే అవకాశం ఉండటంతో పొట్టేళ్ల అమ్మకాలు సాగనున్నాయి.

ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చి పేదలకు పంచడం ఆనవాయితీ. ఈ పండుగ సందర్భంగా ముస్లింలు తమ జీవిత కాలంలో ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తి పొందాలి.

– మహమ్మద్ అబ్దుల్ వదూద్, జామియా మసీదు ఇమామ్

త్యాగ నిరతికి ప్రతీక



బక్రీద్ పండుగ మనిషి దైవ భీతిని, త్యాగ నిరతిని తెలియజేస్తుంది. ఈ పండుగను త్యాగాల పండుగ అంటారు. అంతేకాకుండ చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత.

– సయ్యద్ బాబు, జామియా మసీదు అధ్యక్షుడు, చింతలపూడి

వైభవంగా ఏకాదశి ఉత్సవం



ద్వారకాతిరుమల క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శుక్రవారం రాత్రి శ్రీవారికి తిరువీధి సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు పూజాదికాలను జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

నేత్రపర్వంగా వరాల వెంకన్న కల్యాణం



స్వామివారి రథోత్సవ దృశ్యం



అత్తిలి మండలం ఈడూరులో శ్రీవరాల వెంకన్న కల్యాణోత్సవం

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు గజవాహన సేవ నిర్వహించారు. సుదర్శన సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి శేఖరాచార్యులు, విఖన్ బాబు, పలువురు వేదపండితుల సమక్షంలో స్వామి కల్యాణం నిర్వహించారు. దారాబత్తుల సత్యనారాయణ దంపతులచే మంగళసూత్రాలు, సమతం వెంకటేశ్వరరావు దంపతులచే ముత్యాల తలంబ్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శుక్రవారం తీర్థమహోత్సవం జరిగింది. ఆలయప్రాంగణంలో కోలాట బృందంచే హరే శ్రీనివాస్ భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన జరిగింది. సాయంత్రం స్వామి,అమ్మవార్లను పుష్పాలతో అలంకరించిన రథంపై ఉంచి మేళతాళాలు, మంగళ వాద్యాలు, ఆసాదుల గరగనృత్యాలు నడుమ రథోత్సవం వైభవోపేతంగా జరిపారు.

మాయమాటలతో ఏటీఎంలో సొమ్ము స్వాహా



ఎస్సై నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఆకివీడు: సొమ్ము డ్రా చేద్దామని ఏటీఎంకు వెళ్లిన ఇద్దరికి టోకరా వేసి రూ.39,500 డ్రా చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. అయిభీమవరం టర్నింగ్ వద్ద ఏటీఎంలో డబ్బు డ్రా చేసేందుకు ఉపాధ్యాయురాలు సూర్యకుమారి, ఆమె భర్త సత్యనారాయణమూర్తి వెళ్లారు. ఏటీఎంలో కార్డు పెట్టి కోడ్ కొట్టినా సొమ్ము రాకపోవడంతో.. అక్కడే ఉన్న మరో వ్యక్తి వచ్చి ఇప్పుడే డ్రా చేశాను కార్డు ఇవ్వండి ట్రైచేస్తానని చెప్పాడు. కార్డు లోపల పెట్టగా సొమ్ము రాకపోవడంతో.. అతని వద్ద ఉన్న వేరే కార్డు వాళ్లకు ఇచ్చి ఆ వ్యక్తి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ వద్ద ఉన్న ఏటీఎంకు వెళ్లి సూర్యకుమారి కార్డుతో ఆ వ్యక్తి రూ.39,500 డ్రా చేసి పరారయ్యాడు. డబ్బులు డ్రా చేయడం సెల్‌ఫోన్‌లో మెసేజ్ రాగా.. వెంటనే మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే కార్డు బ్లాక్ చేశారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై హనుమంతు బాధితులతో మాట్లాడారు. సీసీ పుటేజీలు పరిశీలించి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

లాకర్‌లో బంగారు ఆభరణం మాయం

ఆకివీడు : ఇంట్లో ఉంటే దొంగల బెడద అని భయపడి బ్యాంక్ లాకర్‌లో దాచుకున్న బంగారు ఆభరణం మాయమైపోయిన సంఘటనపై బాధితురాలు వల్లభుని శ్రీ పూర్ణ లక్ష్మి శుక్రవారం బ్యాంక్ ఎదుట ఆందోళనకు దిగారు. ఆమెకు మద్దతుగా పలువురు మహిళలు, సీపీఎం నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. గత ఇరవై రోజులుగా లాకర్‌లో బంగారు వస్తువు మాయమైందని బ్యాంక్ అధికారులకు మొరపెట్టుకున్నా సరైన సమాధానం చెప్పడంలేదని, తమది బాధ్యత కాదని బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆమె వాపోయారు. 27 కాసుల ఆభరణం లాకరులో ఎలా పోతుందని ఆమె బ్యాంక్ అధికారుల్ని నిలదీశారు. సీసీ పుటేజీల వివరాలు ఇవ్వమంటే కాలయాపన చేస్తున్నారని ఆమె వాపోయారు. విషయాన్ని మేనేజర్ ఎస్సైకు తెలియజేయడంతో ఆయన వచ్చి మాట్లాడారు. సోమవారం సీపీ పుటేజీలను సాంకేతిక నిపుణులతో పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉన్నతాధికారులు ఎస్సై నాగరాజుకు తెలిపారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ లాకర్‌లో ఉన్న వస్తువులు ఏం ఉన్నాయో తమకు తెలియదని, బ్యాంక్‌లో పోయే అవకాశం లేదన్నారు. ఎస్సై నాగరాజు మాట్లాడుతూ బ్యాంక్‌లోని సీసీ పుటేజ్ సేకరించామని, గతంలో ఓపెన్ కాలేదని.. సాంకేతిక నిపుణుడు సాయంతో సోమవారం పరిశీలిస్తామన్నారు.

అక్రమంగా అమ్ముతున్న వరి విత్తనాల సీజ్



సొనారుద్రవరంలో వరి విత్తనాల బస్తాలు సీజ్ చేసిన జేడీ హబీబ్ బాషా, ఏడీ గంగాధరరావు

కలిదిండి(కై కలూరు): నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వరి విత్తన బస్తాలను సీజ్ చేసి కేసు నమోదు చేసిన ఘటన కలిదిండి మండలం సొనారుద్రవరంలో శుక్రవారం జరిగింది. శ్రీ వేంకటేశ్వర సీడ్స్ విక్రయ దుకాణాన్ని మారుబోయిన సత్యనారాయణ నిర్వహిస్తుండగా.. వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా, ఏడీ ఆర్.గంగాధరరావు, ఏఓ కె.విద్యాసాగర్ తనిఖీ చేశారు. దాడుల్లో 710 క్వింటాళ్ల వరి విత్తన బస్తాలు పట్టుబడ్డాయి. వీటి విలువ మార్కెట్‌లో రూ.21,63,500 ఉంటుందని అధికారులు చెప్పారు. వరి విత్తనాలు విక్రయించాలంటే 30 కేజీల బస్తాలు కలిగిన లేబుల్ సీల్ ఉండాలి. బ్యాగ్‌పై తయారీ తేదీ, వివరాలు, ప్యాకింగ్ ప్రాంతం, విత్తన రకం వంటి వివరాలు ఉంటాయి. అవేమీ లేకుండా 40 కేజీల వరి విత్తనాల బస్తాలు రూ.1,200కు విక్రయిస్తున్నాడు. ఎలాంటి బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయించడం నేరమన్నారు. స్వాధీనం చేసుకున్న ధాన్యాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామన్నారు. ల్యాబ్ నివేదికను బట్టి విక్రయదారుడిపై కేసు నమోదు చేస్తామన్నారు.

వర్షాకాలంలో పశువులకు వ్యాధుల ముప్పు

- సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- ముందుగానే టీకాలు వేయడం ఉత్తమం: వైద్యులు







బుట్టాయగూడెం: ముందస్తు వర్షాలు కురవడంతో పాటు వానాకాలం రావడంతో పశువులు, గొర్రెలు ఇతర జీవాలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. జీవాలకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే సకాలంలో అందుబాటులో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించి సరైన చికిత్స అందించాలని సూచిస్తున్నారు.

బ్లూ టంగ్– ఫుట్ రాట్ లక్షణాలు

గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధులు సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, నోటిలోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్ల కుంటడం, ఒంట్లో నీరు చేరడం, పారుకోవడం, మేత మేయకపోవడం, ఈసుకుపోవడం (అబార్షన్‌లు) వంటి లక్షణాలు ఉంటాయి. వీటి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడూ బ్లూటాక్స్/టిక్కిల్ మందులు పిచికారీ చేస్తూ పోడు ప్రాంతాల్లో మేతకు తీసుకెళ్లాలి.

కాళ్ల పుండ్ల వ్యాధి

జీవాలకు కాళ్ల పుండ్లు వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి చెడువాసన వస్తుంది. గొర్రెలు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు జీవాలను బురద ప్రాంతంలో మేపకూడదు. పొడి ప్రాంతంలోనే మేసేలా చూడాలి.

గొంతు వాపు వ్యాధి

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని గురక వ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల వల్ల సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీటి ద్వారా, మేత ద్వారా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధుల బారిన పడతాయి. గొంతువాపు వ్యాధి బారిన పడిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన వాటికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఒకేపాకలో మిగతావాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. వర్షాకాలంలో పశువులు వర్షాలకు తడవకుండా చూడాలి.

నివారణ చర్యలు

జూన్, జులై, ఆగస్టు నెలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వ్యాధి సోకిన పశువులను మిగిలినవాటి నుంచి వేరు చేయాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలి.

చిటికె వ్యాధి

ఇది గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. ఎంటరోటాక్సీమియా అనే బ్యాక్టీరియా వల్ల తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఏడాది వయసున్న గొర్రెల్లో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రె తక్కువ సమయానికే మరణిస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు నీరసిస్తాయి. కొద్దిసేపటికే గొర్రెలు గిలగిలా కొట్టుకుని గాలిలో ఎగిరి కిందపడి మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలను ఉదయం, మధ్యాహ్న వేళల్లో గొర్రెల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేయాలి.

వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం



వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందుగానే టీకాలు వేయించుకోవడం ఉత్తమం. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకు ముప్పు. వ్యాధులను గుర్తిస్తే దగ్గరలో ఉన్న పశువుల ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. సకాలంలో వైద్యం అందేలా చూడాలి.

– డాక్టర్ మల్లంపల్లి సాయి బుచ్చారావు, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ, జీలుగుమిల్లి

మూణ్నాళ్ల ముచ్చటగా రోడ్డు మరమ్మతులు



కొత్తపూసలమర్రు బోణకాల దిబ్బ మధ్య ధ్వంసమైన రోడ్డు

భీమవరం అర్బన్ : భీమవరం మండలంలోని గూట్లపాడు రేవు నుంచి దొంగపిండి వరకు ఆర్ అండ్ బీ రోడ్డుపై చేపట్టిన రోడ్డు మరమ్మతులు మూడు నెలలు గడవక ముందే పాడయ్యాయిజ గూట్లపాడు రేవు, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి వరకు సుమారు 10 కిలోమీటర్లు గతంలో రోడ్డు ధ్వంసమవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్ ప్రక్రియ ద్వారా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ ఉపయోగించి రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో గోతులు ఏర్పడుతున్నాయి. ఈ మార్గం గుండా నిత్యం స్కూల్ బస్సులు, చేపల లారీలు, వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డు వేసేటప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు మరమ్మతులు చేపట్టి మూడు నెలలు గడవకు ముందే ధ్వంసమైంది. దీంతో ఈ రోడ్లపై ప్రయాణమంటేనే ప్రజలు భయపడుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: దెందులూరు మండలం సోమవరప్పాడు వైఎస్సార్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవరప్పాడు వైఎస్సార్ కాలనీకి చెందిన చండిగ వీరవెంకట నరేంద్ర(38) కూలీ పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో జీవిస్తున్నాడు. కుటుంబ జీవనంలో ఆర్థిక సమస్యల కారణంగా భార్య, భర్తల మధ్య కొద్దిరోజులుగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలు, ఇబ్బందులు తట్టుకోలేక గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ నరేంద్ర శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మావోయిస్టు అగ్రనేత సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలని, మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టింటు లక్ష్మీ నరసింహ చలం అలియాస్ సుధాకర్ ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలంలోని సత్యవోలు గ్రామానికి చెందిన వారని, ఏలూరు సీఆర్ఆర్ కాలేజీలో చదువుకున్నారని తెలిపారు. జూన్ 5న బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో సుధాకర్ మరణించినట్లు తెలిపారు.

కోకో గింజల బస్తాల చోరీ

జంగారెడ్డిగూడెం: కోకో గింజల బస్తాలు చోరీకి సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వేగవరం గ్రామానికి చెందిన అట్లూరి శ్రీనివాసరావు తన ఇంటి వద్ద వరండాలో 30 కోకో గింజలు బస్తాలు ఉంచారు. ఈ నెల 4న కోకో గింజల విక్రయానికి జంగారెడ్డిగూడెం మార్కెట్‌కు తీసుకెళ్దామని చూడగా, వాటిలో 6 బస్తాలు కనిపించలేదు. ఆ మేరకు శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రామచర్లగూడెంలో పెన్మెత్స అరుణ్ వర్మకు చెందిన ఉడక బెట్టిన కోకో గింజలను చోరీ చేశారు. అరుణ్ వర్మ పొలం వద్ద ఉడకబెట్టిన కోకో గింజలను ట్రేలో ఉంచాడు. వీటిని 4న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి దొంగిలించుకుని పోయినట్లు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురం అండర్ పాస్ ప్రాంతంలో ఉన్న శ్రీసంపద వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని హుండీలో నగదును దొంగలు చోరీ చేశారు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనలో హుండీని తొలగించి ఆలయం వెనుక భాగంలోకి తీసుకువెళ్లి చోరీ చేసినట్లుగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దొంగలు ఆలయ ఆవరణలోని సీసీ కెమేరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను సైతం పెకలించి తీసుకుపోయినట్లుగా చెబుతున్నారు. ఇటీవల ఆలయానికి ఆనుకుని ఉన్న కొండాలమ్మ పుంత ప్రాంతంలో 4 ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా లాభం లేకుండా పోయిందంటున్నారు.

ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు

పెదపాడు: బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష నగదును సైబర్ నేరగాళ్లు మాయం చేశారు. దీంతో బాధితుడు శుక్రవారం పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని తోటగూడెం గ్రామానికి చెందిన అంగలూరి వెంకటాచార్యకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ పేరు అంగలూరి వెంకటాచార్యులేనా? మీ భార్యపేరు ఇదేనా? అని అడిగాడు. అవును చెప్పగానే మీకు ఆరోగ్యశ్రీ ద్వారా ఖాతాలో డబ్బులు పడ్డాయని ఓటీపీ చెప్పమని అడిగాడు. నిజమని నమ్మి ఓటీపీ చెప్పారు. అనంతరం విడతల వారీగా రూ.లక్ష వరకు నగదు మాయమైనట్లు గుర్తించి పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబులెన్స్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అంబులెన్స్ డ్రైవర్ ఉరివేసుకుని అనుమానస్పదంగా మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని 36వ వార్డుకు చెందిన గవిడి నాగరాజుకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్దబ్బాయి గవిడి సాయి (22) ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సాయి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం అర్ధరాత్రి కొవ్వాడ పుంతలోని తన స్నేహితుడి ఇంట్లో సాయి ఉరి పోసుకున్నాడు. తండ్రి గవిడి నాగరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు, వెండి వస్తువుల చోరీ

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు వెండి, బంగారు వస్తువులు అపహరించుపోయారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్‌లోని శివకామాక్షి కాలనీకి చెందిన బాలవలస నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి వ్యక్తిగత పనులపై ఈనెల 4న ఊరు వెళ్ళారు. తిరిగి శుక్రవారం ఇంటికొచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని అరకేజీ వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఘనంగా గోగులమ్మ జాతర మహోత్సవాలు


విశేష అలంకరణలో గోగులమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసి యున్న గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. నెయ్యితో హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద, అమ్మవారి పూరిగుడిసె వద్ద విశేష కార్యక్రమాలు జరిగాయి. సేవాసమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. సాయంత్రం మిరియాల రవిబాబు రేడియో, టీవీ అర్టిస్టు బృందంచే ఉత్తర అభిమన్యుల కల్యాణం బుర్రకథ జరిగింది. మహిళలు, యువత, పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు


విశేష అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దేవస్థానంలో బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. దాతలు సహాయ సహకారాలతో అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శారీరక వ్యాయామంతో ఆరోగ్యం


సచివాలయంలో ప్రాణాయామం సాధన చేయిస్తున్న విమెన్ వెల్ఫేర్ సెక్రటరీ వీణ

తాడేపల్లిగూడెం రూరల్: శారీరక వ్యాయామంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని విమెన్ వెల్ఫేర్ సెక్రటరీ వీణ అన్నారు. కిశోర వికాసం స్పెషల్ సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం మండలంలోని కొండ్రుప్రోలు సచివాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీణ మాట్లాడుతూ నిత్యం ఉదయం, సాయంత్రం ఒక గంట పాటు యోగా సాధన చేస్తే ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. యోగా ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం ప్రాణాయామం సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణపరమాత్మకు పంచామృత అభిషేకాలు


కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రీ కృష్ణ పరమాత్మకు శుక్రవారం పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. నూతన పట్టువస్త్రాలతో విశేష అలంకరణ గావించారు. అదే విధంగా చింతామణిదేవి అమ్మవారికి, పరివార దేవతలకు పూజలు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

సబ్సిడీపై పశువులకు దాణా పంపిణీ


రేలంగిలో సబ్సిడీ పై పశువుల దాణా పంపిణీ చేస్తున్న అధికారులు

ఇరగవరం: మండలంలోని రేలంగి వెటర్నరీ హస్పటల్ పరిధిలోని రైతులకు శుక్రవారం సబ్సిడీ పై పశువుల దాణా పంపిణీ చేయడం జరిగిందని వెటర్నరీ వైద్యులు పివిబిఎస్‌వి ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం రాయితీతో అందజేస్తున్న ఈ దాణాలో అన్ని రకాల పోషక విలువలు ఉంటాయని రైతులు అందరు తప్పకుండా వారి పశువులకు ఈ దాణా వినియోగించాలన్నారు.

వసుధ ఫౌండేషన్ సాయం

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజలను కష్టాల్లో ఆదుకుంటూ వసుధ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు పంపిన చెక్కులను గాంధీరాజు ఐదుగురు అనారోగ్య బాధితులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బుద్ధరాజు, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కానరాని కూటమి మేనిఫెస్టో

- మేనిఫెస్టో అమలెక్కడ..?
- కూటమి మేనిఫెస్టో అమలు కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఏడాది పూర్తయినా పింఛన్ తప్ప మరేదీ లేదంటున్న వైనం
- జగన్ హయాంలో ఏడాదిలోపే 90 శాతం మేనిఫెస్టో అమలు
- కోవిడ్‌లోనూ వెనక్కి తగ్గలేదంటూ జగన్ పాలనపై ప్రశంసలు



తణుకు ముఖద్వారం

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారం దక్కించుకోవడానికేతప్ప హామీల అమలులో కూటమి నేతలు మీనమేషాలు లెక్కిస్తుండడంతో మేనిఫెస్టోకి విలువ లేకుండా పోయిందంటూ ప్రజానీకం విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈనెల 4వ తేదీకి ఏడాది పూర్తయినప్పటికీ ఇంతవరకు మేనిఫెస్టోని అమలు చేయలేదంటూ ప్రజానీకం ధ్వజమెత్తుతున్నారు. పింఛన్ వెయ్యి పెంపు తప్ప మరొక్క హామీ అమలు చేసిన దాఖలాలు లేవంటూ లబ్ధిదారులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఎన్నికల ముందు హామీలు గుప్పించడమెందుకు ప్రజల్ని మోసం చేయడమెందుకంటూ మండిపడుతున్నారు. ఏరు దాటాక తెప్ప తగలేసిన మాదిరిగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని, మాయమాటలు, వంచన, మోసానికి తలొగ్గి ఓట్లేశామంటూ ప్రజానీకం శాపనార్థాలు పెడుతున్నారు. సంపద సృష్టిస్తానని హామీలన్నీ నెరవేరుస్తానని చెప్పి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాన్ని నిండా మోసం చేశారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

మేనిఫెస్టో అమలంటే జగన్ హయాంలోనే..

ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలు నేరుగా చూసి సృష్టించిన మేనిఫెస్టోని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భగవద్గీత, ఖురాన్, బైబిల్ మాదిరిగా భావించి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 90 శాతం హామీలను అమలుచేశారని ప్రజానీకం చెబుతున్నారు. ముఖ్యంగా అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యా కానుక, ఆరోగ్యశ్రీ, కాపు నేస్తం, చేయూత, ఈబీసీ నేస్తం, రైతు భరోసా, సున్నా వడ్డీ వంటి పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసి జగన్ చరిత్రలో నిలిచారని ప్రజలు కొనియాడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్లపాటు కోవిడ్ మహమ్మారి వీరవిహారం చేసి ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపినా ఏ పథకం కూడా ఆపకుండా అమలుచేశారని, కానీ నేడు ఏడాది పూర్తయినా ఒక్క పథకం కూడా అమలు చేయలేదని ప్రజలు తూర్పారపడుతున్నారు. నీకు రూ. 15వేలు, నీకు రూ. 18వేలు అని, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు అంటూ కూటమి నేతలు డప్పు వాయించి మరీ ప్రచారం చేసిన పథకాల కోసం ఎదురుచూపులు చూస్తున్నా పట్టించుకోవడంలేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ హయాంలో మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలన్నిటిని సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకున్నారని ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

నాడు మేనిఫెస్టోని పవిత్రంగా చూశారు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోని ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా వర్ణించారు. అంతే పవిత్రంగా భావించి ఏడాదిలోపే 90 శాతం హామీలను అమలుచేసి చరిత్రలో నిలిచారు. కోవిడ్ వంటి పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అమలుపరచి పేదవర్గాల గుండెల్లో గూడుకట్టుకున్నారు. ఆయన పాలనలో మైనారిటీలు అంతా ఎంతో ఆర్థికంగా సుభిక్షంగా ఉన్నారు.

– మెహర్ అన్సారీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

నేడు మేనిఫెస్టోని తుంగలోతొక్కారు



కూటమి నేతలు ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పొందు పరిచిన హామీలు ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా ఏ ఒక్కటీ అమలుచేయలేదు. ముఖ్యంగా విద్య, వైద్యానికి ఎటువంటి సంక్షేమం అందకపోవడంతో దళిత వర్గాలు విద్యలో వెనుకబాటు తనంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఉచిత వైద్యం అందని ద్రాక్షలానే మిగిలింది. జగన్ హయాంలో మేనిఫెస్టో అమలుచేయడంలో బాధ్యతగా వ్యవహరించారు.

– పొట్ల సురేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

మేనిఫెస్టో అమలు చేయలేకపోయారు



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు ఏఒక్క సంక్షేమ పథకం అమలుకాకపోవడంతో పేద వర్గాలు ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన పింఛను తప్ప మరే పథకం అమలుచేయకపోవడంతో ముఖ్యంగా దివ్యాంగులు వారి పిల్లలను చదివించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అమలుచేయకపోవడం ప్రభుత్వ చేతకానితనంగా భావించాలి.

– బుడితి సుజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు

ఆశా నియామకాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెంటపాడు: పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని సచివాలయం -2లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు కోసం తక్షణం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి తోట రాజేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంహెచ్‌వో గీతాబాయ్ ఆదేశాల మేరకు జిల్లాలో 65 ఆశాపోస్టుల ఖాళీలను భర్తీ చేసే కార్యక్రమంలో భాగంగా ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. స్థానిక గ్రామ పంచాయతీలో ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి తోట రాజేష్ సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న మునిసిపల్ కమీషనర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆదేశాలు మేరకు నా మొక్క, నా శ్వాస కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడద్దామని తెలియజేస్తు పట్టణంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. మునిసిపల్ కమీషనర్ యేసుబాబు, ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కరిబండి రామకృష్ణ, లయన్ గట్టిం మాణిక్యాలరావు, యోగా గురువు బడుగు చంద్రశేఖర్, సివిక్స్ లెక్చరర్ పీవీ నాగార్జున్, యోగా సభ్యులు పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరరావు జీవితం స్ఫూర్తిదాయకం


తణుకులో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు జయంతి వేడుకలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు అర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 సంవత్సరాల పాటు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు తమ సేవలు అందించారనీ, ఆయన గొప్ప సామ్యవాది అని ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి సందర్భంగా స్థానిక సొసైటీ రోడ్డులోని వైఎస్సార్ మునిసిపల్ పార్కులోని కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు శిలా విగ్రహం వద్ద శనివారం నివాళులర్పించారు. నేటి యువతరం కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమసమాజ స్థాపనకు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా శిలా విగ్రహానికి పూలమాలలువేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బెల్లంకొండ బుచ్చిబాబు, తణుకు శశి విద్యా సంస్థల క్యాంపస్ ఇన్‌చార్జ్ నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర కౌన్సిలర్ కోట రామప్రసాద్, ప్రముఖ న్యాయవాది పిట్టా శ్యాముృల్, వాకర్స్ క్లబ్ నాయకులు కోడూరి ఆంజనేయులు, రోటరీ క్లబ్ సభ్యులు అక్కిన కాశీ విశ్వనాథం, మానవత సంస్థ నాయకులు ఆలపాటి సుబ్బారావు, తణుకు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఆంగ్ల భాష ఉపాధ్యాయులు గజ్జరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమష్టికృషితో దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రం పదోవ క్లస్టర్‌లో డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మలేరియా నివారణ కార్యక్రమాలు జరిగాయి. ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారానికి ఒక్కసారి తప్పక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమ లార్వాలను నివారించేందుకు సమిష్టికృషి ఎంతో అవసరమని చెప్పారు. పరిసరాలు, ఇళ్లలోను నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, లక్ష్మీకళ, లక్ష్మీకుమారి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, కిలారీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని శాంతి నగర్‌లోని రక్షిత మంచినీటి పథకం ద్వారా దుర్వాసనతో కూడిన పసరు నీరు సరఫరా అవుతుందని ఆప్రాంత మహిళలు, ఐద్వా నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వాటర్ ట్యాంక్ వద్ద నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు డోకల లక్ష్మి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నగర పంచాయతీ పరిధిలోని పలు ట్యాంకుల ద్వారా కుళాయి నీరు దుర్వాసనతో వస్తున్నాయని, పసర్లుదేరి ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు గానీ, కమిషనర్ గానీ వార్డుల్లో పర్యటించడం లేదని, ప్రజా సమస్యల్ని తెలుసుకోవడంలేదని వాపోయారు. స్థానికంగా కమిషనర్ కాపురం ఉండకపోవడంతో మంచినీటి సమస్య ఆయనకు పట్టడంలేదని విమర్శించారు. వాడకానికి కూడా పనికిరాకుండా ఉన్న నీటిని సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శివారు ప్రాంతాలకు మంచినీరు అందడంలేదన్న సాకుతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి పసర్లతో ఉన్న నీటిని కూడా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి ప్రజలకు తాగునీరందించాలన్నారు. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరా నిలుపుదల వంటి చర్యలు చేపట్టడం మానుకోవాలన్నారు. మంచినీటి సమస్యపై అధికారులు స్పందించకపోతే నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులు, రిసోర్స్‌పర్సన్ తదితరులు


అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక గ్రేడ్ –1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. సభ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ మాట్లాడుతూ సమాజంలో జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంలోను, విద్యను ప్రోత్సహించడంలోను గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయని చెప్పారు. విద్యార్థులు ఎంతో శ్రద్ధతో వేసవి శిక్షణలో పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తప్పక ప్రతి రోజు గ్రంథాలయాన్ని సందర్శించాలని, పుస్తకాలలోని జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చక్కని చదువులు చదవాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోయంక ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వి.గణపతిరామ్, రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామి, గరికపాటి బాపయ్య శర్మ, కోపల్లె శ్రీనివాస్, జనార్థనరావు, పుష్పవతిలను సత్కరించారు. శిక్షణలో భాగంగా జరిగిన వివిధ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. చదవరులు, పెద్దలు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

అత్తిలి: అత్తిలి శాఖా గ్రంథాలయంలో 34 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసాయి. ప్రతి రోజు విద్యార్థులచే పుస్తక పఠనం, కథలు చెప్పించటం, పుస్తక సమీక్ష చేయటం, ఇంగ్లీష్ మాట్లాడించడం, చిత్రలేఖనం నేర్పటం, క్విజ్ పోటీలు జరపటం, డ్యాన్స్, క్యారమ్స్ తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్స్ ద్వారా శిక్షణ ఇప్పించినట్లు గ్రంథాలయాధికారి డి. కష్టారావు తెలిపారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు, రిటైర్డ్ గ్రంథాలయాధికారి గంధం శేష వేంద్రరావు, పి వెంకటేశ్వరరావు, వై. ప్రసాద్, ఎం. శ్రీదేవి ,వి.లక్ష్మణరావు ఎం.పార్వతి , టి.సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డులు అందుకోనున్న జూనియర్ కళాశాల విద్యార్థినులు

  
వడితే శ్రీలత | షేక్ ఆఫ్రా హసీన్ | చల్లా శిరీషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీలు జిల్లాస్థాయి ప్రతిభ అవార్డులు అందుకోనున్నారు. ఈ ఏడాది వార్షిక పరీక్షలలో కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినీలు హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరం చదివిన వడితే శ్రీలత, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ కోర్సును అభ్యసించిన షేక్ ఆఫ్రా హసీన్, చల్లా శిరీషాలకు పురస్కారాలు లభించనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ నాగవేణి వెల్లడించారు. విద్యార్థినీలకు మెడల్, సర్టిఫికెట్‌లతో పాటు రూ 20 వేలు నగదు పురస్కారం లభించనున్నాయి. అత్యధిక మార్కులతో, అవార్డులు అందుకోనున్న విద్యార్థినీలను కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వేతన బకాయిలు చెల్లించండి


రేలంగిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఇరగవరం: కూలీలకు వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామాల్లో పని చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ పేదలకు కూలీ సొమ్ములు చెల్లించకపోవడంపై దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతన బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఐక్య పోరాటాలకు సిద్ధం చేశామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తుల సంఘం నాయకులు ఇల్లిందలపర్తి సత్యనారాయణ, ముప్పిడి నవీన, బూర మాణిక్యలరావు, కడలి సత్యవతి, టి ఉష, ఎం రాణి, యు సోమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికీ గురువు అనుగ్రహం కావాలి


దత్త క్షేత్రంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం స్థానిక దత్త క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్త క్షేత్రం కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలోనూ, ప్రపంచంలోని పలు దేశాల్లో స్వామి వారి అనుగ్రహంతో దత్త క్షేత్రాలు, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాలు, ఆధ్మాత్మిక , ఆయుర్వేద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలోని పలువురికి దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దత్త క్షేత్ర ఉపాధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం


అలంపురం మిడ్‌లెవిల్ కాలువ వద్ద వంతెన సమీపంలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు, చెత్త


కె. పెంటపాడు సామూహిక మరుగుదొడ్ల వద్ద పంచాయతీ డంపింగ్ యార్డులో కవర్లు

- ముంచుకొస్తున్న ముప్పు
- పట్టించుకోని అధికారులు

పెంటపాడు: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రతిబంధకంగా మారాయి. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు మానవాళి మనుగడును ప్రశ్నిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని అధికారులు సమావేశాల్లో పలుమార్లు తీర్మానాలు చేసినా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం మాత్రం విచ్చలవిడిగా కొనసాగుతుంది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ రోజు మాత్రమే స్వచ్ఛభారత్..ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీలు, నిర్వహిస్తున్న అధికారులు, యంత్రాంగం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదు. డ్వాక్రా మహిళల ద్వారా మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ఓ వైపు ప్లాస్టిక్ నిషేధంతో పాటు మరోవైపు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలో తీసుకున్న నిర్ణయాలను యంత్రాంగం నేటికీ అమలు చేయడం లేదు.

రోజు టన్ను ప్లాస్టిక్‌వ్యార్థాలు

లక్షన్నర జనాభా తాడేపల్లిగూడెంలో టన్నుల వరకూ చెత్తాచెదారంతో కూడిన వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. ఇందులో ఒక టన్ను పైగా ప్లాస్టిక్ వ్యర్థా లు ఉండటం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికులు రోజూ ఈ వ్యర్థాలను తొలగిస్తున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు కనిపిస్తూనే ఉన్నాయి. దుకాణాల్లోని వ్యర్థాలను రోడ్లు, మురుగు కాలువల్లో వేస్తుండడంతో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది.

ఆకస్మిక తనిఖీలు.. జరిమానాలేవా?

పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు గతంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న, వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించేవారు. దీంతో గతంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొంత తగ్గింది. కానీ ప్రస్తుతం పారిశుద్యాన్ని పరిశీలిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఫోటోలను షేర్ చేస్తున్నారే తప్ప ప్లాస్టిక్ నిషేదంపై దృష్టి సారించడం లేదన్నది పర్యావరణ హితులు విమర్శిస్తున్నారు.

వస్త్ర సంచుల వినియోగమేదీ?

పాలిథిన్ కవర్ల స్థానంలో వస్త్ర సంచులను డ్వాక్రా మహిళ ద్వారా తయారు చేయించి వాటిని మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు, హోల్‌సేల్ వ్యాపారస్థులకు విక్రయించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిర్ణయించారు. తర్వారా ప్లాస్టిక్ నిషేధంతో పాటు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి పాటు పడాలని సంకల్పించారు. కానీ ప్రస్తుతం ఆ దిశగా దృష్టి సారించడం లేదు.